ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 30 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	125
డ్రెస్	180
స్కిన్‌లెస్	210
గుడ్డుడజన్	72

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	24.2

వరుణుడి కరుణ కోసం



ఈ ఏడాది ముందస్తుగా తొలకరి మురిపించడంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేయగా, ఆయకట్టు రైతులు బోరుబావులు, చెరువుల ఆధారంగా నారు తయారు చేసుకోవడంలో తలమునకలయ్యారు. జూలై రెండోవారంలో వరినాట్లు మొదలుపెట్టేందుకు వీలుగా నారుమళ్లు సిద్ధం చేశారు. అయితే వారం రోజులుగా ప్రతికూల వాతావరణం ఎండాకాలాన్ని తలపిస్తుండటంతో నారుమళ్ల ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ అర్బన్)

రాచకొండపై రైతుల ఆశలు



సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీటి శాశ్వత సమస్య పరిష్కారానికి రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే రాచకొండలో రిజర్వాయర్ విషయాన్ని ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. - (ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్)

7



లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడికి ఆదివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు కొనసాగాయి. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలోనూ నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. ఆదివారం వారంతపు సెలవు అయినప్పటికీ హైదరాబాద్‌లో బోనాల పండుగ కావడంతో యాదగిరిగుట్ట క్షేత్రానికి భక్తుల రాక స్వల్పంగా తగ్గింది. ఉదయం, సాయంత్రం, బ్రేక్ దర్శనం, ఆరగింపు సమయాల్లో సుమారు 3 గంటల పాటు భక్తులు నిల్చోవడంతో క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. సుమారు 46వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.51,93,737 ఆదాయం సమకూరింది.

పాత వారుండరు.. కొత్తవారికి ఇవ్వరు

» పురపాలిక ఆదాయానికి గండి » మునిసిపల్ మడిగెల దుర్వినియోగం




మిర్యాలగూడలోని ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్

ప్రజాధనం వెచ్చించి నిర్మించిన మునిసిపల్ మడిగెలు దుర్వినియోగం అవుతుండగా, పురపాలిక ఆదాయానికి గండి పడుతోంది. మిర్యాలగూడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఎన్టీఆర్ షాపింగ్ సముదాయంలోని గదుల అద్దె అగ్రిమెంట్ గడువు తీరినా, కొత్తవారికి కేటాయించడం లేదు. గతంలో టెండర్ల ద్వారా దుకాణాలు పొందిన వారు లక్షల రూపాయలకు వాటిని ఇతరులకు అద్దెకు ఇస్తున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.
- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో 2000లో ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌ను 90 దుకాణాలతో నిర్మించారు. మునిసిపాలిటీకి స్టోర్‌రూంల కోసం రెండు దుకాణాలు కేటాయించగా, 2001లో ఆరు షాపులు, 2002లో 60, 2004లో 22 దుకాణాలకు ఓపెన్ టెండర్లు పిలిచి రూ.2,400 నుంచి రూ.4,000 అద్దెకు ఇచ్చారు. కాగా, అందులో మూడోవంతు షాపులను టెండర్లలో దుకాణాలు పొందినవారు అధిక అద్దెకు సబ్‌లీజుకు ఇచ్చారు. ఏళ్లతరబడి అధికారులు అద్దె పెంచకపోవడంతో రాబడి భారీగా తగ్గింది. కొందరు దుకాణదారులు మూడేళ్లు, ఐదేళ్లకు లీజు..

- మిగతా 8వ పేజీలో...



కొలువు ఓ చోట విధులు నచ్చిన చోట

జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పైఅధికారుల నుంచి వచ్చిన బదిలీ ఆర్డర్లను సైతం పక్కన పెట్టి ఇష్టమైన చోట విధు లు నిర్వహిస్తున్నారు. బదిలీలు చేసిన ప్రాంతంలో విధులు నిర్వహించాల్సి ఉండగా, కొందరు లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు అంతర్గత ఒప్పందాలతో అక్రమంగా ఆదాయం వచ్చే ప్రాంతాల్లో తిష్టవేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/నల్లగొండ టౌన్)

- » విద్యుత్‌శాఖలో ఇదోరకం దందా
- » ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- » ఏళ్లకొద్దీ అంతర్గత ఒప్పందాలతో విధులు
- » మునుగోడు విద్యుత్ సబ్ డివిజన్‌లో ఆగమాగం

మునుగోడు విద్యుత్ సబ్ డివిజన్‌లోని చండూరు మండలంలో ముగ్గురు లైన్‌మెన్‌లు 17 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరికి బదిలీల సమయంలో స్థానచలనం జరిగినా, తిరిగి అదే ప్రాంతంలో పనిచేస్తుండటం గమనార్హం. బదిలీలకు సంబంధించిన రికార్డుల్లో మాత్రం వారు ఇతర ప్రాంతంలో పనిచేస్తున్నట్లు ఉన్నా, క్షేత్రస్థాయిలో మాత్రం వారికి సంబంధం లేని ప్రాంతంలో వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో అక్రమ ఆదాయం వస్తుండటంతో వారి మధ్య ఒప్పందాలు చేసుకొని పాత స్థానంలోనే పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో పరిచయాలు పెరగడం, అక్రమంగా ఆదాయం వస్తుండటంతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని ఎక్కడివారు అక్కడే ఉంటూ, బదిలీ చేసినా ఏళ్లకొద్దీ అదే ప్రాంతంలో తిష్టవేసి ఉంటున్నారు. ఈ విషయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?..

బదిలీలు జరిగితే సదరు లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు వారికి కేటాయించిన ప్రాంతానికి వెళ్లి విధుల్లో చేరాలి. అయితే వీరంతా ఆర్డర్ కాపీతో జాయిన్ కావడం మినహా వారికి కేటాయించిన ప్రాంతంలో మాత్రం పనిచేయడం లేదు. ఇంత జరుగుతున్నా ఈఈలు, డీఈలు, ఇతర ఉన్నతాధికారులు ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదో తెలియడం లేదు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగితే ఎవరుబాధ్యత వహించాల్సి ఉంటుందో అర్థం కాని పరిస్థితి. ప్రమాదం జరిగితే ఆ ప్రాంతం తమది కాదంటే, తమది కాదని తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ సమస్యలు ఏర్పడినప్పుడు, స్తంభాలు ఒరిగినప్పుడు, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలినప్పుడు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సమాచారం ఇస్తే సమస్య పరిష్కారం కావడంలేదని, డబ్బు ఇస్తేనే పట్టించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిరంతరం సబ్ డివిజన్‌ను పర్యవేక్షణ చేస్తున్న సమయంలో రికార్డుల ప్రకారం ఆయా ఉద్యోగులకు ఫోన్ చేసే ఉన్నతాధికారులకు సైతం ఎందుకు అనుమానం రావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పై అధికారులకు ముడుపులు ముట్టడం వల్లే పట్టించుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోస్టింగ్ ఓ చోట.. పనిచేసేది మరో చోట..

జిల్లాలోని మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని..

- మిగతా 8వ పేజీలో..

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

డిండి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల 15వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఆర్థిక, అసమానతలులేని సమాజం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. ఓట్లు, సీట్లతో సంబంధంలేకుండా ప్రజా సమస్యలే ఎజెండాగా, నిత్యం ప్రజల మధ్య ఉండి సీపీఐ పోరాడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తుందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, బొడ్డుపల్లి వెంకటరమణ, ఎండీ మొయినొద్దీన్, బుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, తిప్పర్తి విజయేందర్‌రెడ్డి, బొల్లె శైలేజ్, బొడ్డుపల్లి రాజేందర్‌శర్మ, నూనె వెంకటేశ్వర్లు, కేశవులు, హుస్సేన్ పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కనకచారి: సీపీఐ మండల కార్యదర్శిగా తిరిగి రెండోసారి శ్రీరామదాసు కనకచారిని ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా బొల్లే శైలేజ్, టి.విజేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి మాట్లాడుతూ పార్టీ నిర్మాణానికి, బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మునుగోడు ఎంజేపీలో విద్యార్థినులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యేకు పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా తమకు సరిపడా భోజనం వడ్డించటం లేదని చెప్పటంతో నిర్వాహకులతో మాట్లాడారు. మరోసారి ఫిర్యాదు రాకుండా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యుత్ సమస్య కారణంగా నీటి సరఫరాపై సరిగా కావడంలేదని ఆయన దృష్టికి తీసుకురాగా, ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, మర్రిగూడ మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఉన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న పోచారం

గోపలాయపల్లిలో మాజీ స్పీకర్ పూజలు



ఆలయంలో స్నేహితులతో కలిసి పోచారం శ్రీనివాసరెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్త, 1965లో నిజామాబాద్‌లో చదువుకున్న తన మిత్రుడైన కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు పోచారం తన స్నేహితులతో కలిసి ఆలయ సందర్శనకు వచ్చారు. వారంతా వేణుగోపాలస్వామి ఆలయ మూలవిరాట్టు వద్ద ప్రత్యే క పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పోచారం శ్రీనివాసరెడ్డికి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అందరూ వయసుకు.. పెళ్లికి... షష్టిపూర్తి చేసుకుంటారు.. మేము మాత్రం స్నేహితులుగా షష్టిపూర్తి చేసుకుంటున్నామని చమత్కరించారు.శ్రీనివాసరెడ్డి వెంట ఆయన స్నేహితులు రమేష్‌రెడ్డి,జనార్థన్‌రెడ్డి, రవీందర్,మహిపాల్, నర్సింహారెడ్డి, శాంతకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు బక్కా శ్రీనివాసచారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు సకాలంలో అందించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల అవసరం మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. పీఆర్సీ గడువు తీరినందున రిపోర్టు వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి మాట్లాడుతూ జూలై చివరి నాటికి సంఘం సభ్యత్వం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం,ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, బి.అరుణ, కోశాధికారి వడిత్య రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, గేర నరసింహ, యాట మధుసూదన్‌రెడ్డి, రమాదేవి, నలపరాజు వెంకన్న, చిన వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ఆషాడ బోనాలు



కనగల్, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాడమాసం ప్రారంభమైన దృష్ట్యా పలువురు భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

వివాహేతర సంబంధం
అంటగట్టారని..

● ఇద్దరి బలవన్మరణం

14

నేడు చెర్వుగట్టుకు శైలజా రామయ్యర్

నార్కట్‌పల్లి,జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ నార్కట్‌పల్లి మండలంలోని పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి సోమవారం రానున్నారు. ఎండోమెంట్ కమిషనర్ వెంకట్రావు, కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి ఆమె దేవస్థానంలో అభివృద్ధిపై సమీక్షించనున్నారు. ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో గుట్టపై అభివృద్ధి, ఆలయ నిర్వహణ తదితర అంశాలతో ఇప్పటికే నివేదికను సిద్ధం చేశారు.

బొమ్మలతో సందేశం..



పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నల్లగొండ జిల్లాకేంద్రంలో మునిసిపల్ అధికారులు ఫ్లైఓవర్ గోడలపై పెయింటింగ్స్ వేయించారు. మెడికల్ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, తడి, పొడి చెత్తను వేరే చేసి ఇచ్చే విధానంపై సందేశం వచ్చే విధంగా బొమ్మలతో కూడిన పెయింటింగ్స్ వేయించి అవగాహన కల్పిస్తున్నారు. సరికొత్తగా వేసిన పెయింటింగ్స్ పట్టణ ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. బొమ్మలతో మంచి సందేశం ఇస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ● (రామగిరి, ఆంధ్రజ్యోతి)

వీధి కుక్కకు ప్రాణం పోసి..

విషాహారం తిని అస్వస్థతకు గురైన శనకం



కుక్కకు వైద్యసేవలు అందిస్తున్న పెంటయ్య

కోదాడ రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని పెరిక హాస్టల్ హైబజారులోని నివాస గృహాల మధ్య తిరిగే ఓ వీధి కుక్క ఆదివారం విషాహారం తిని అస్వస్థతకు గురైంది. గమనించిన జంతు ప్రేమికుడు పూర్ణచందర్ ఆ వీధి కుక్కను స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలకు తీసుకొచ్చారు. ఆదివారం వారాంతపు సెలవులో ఉన్నప్పటికీ వైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య వైద్యశాలకు చేరుకుని విషానికి విరుగుడు ఔషధాలతో అత్యవసర వైద్యసేవలు అందించి, కుక్క ప్రాణాలు కాపాడారు.

అప్పుల బాధతో మనస్తాపం చెంది..



మధుసూధనాచారి మృతదేహం

సూర్యాపేటక్రైం, జూన్ 29, (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు, మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సైనిక్‌పురికాలనీలో నివాసముండే తౌవిటి మధుసూధనాచారి(47) పట్టణంలోని బొడ్రాయిబజార్‌లో బంగారు నగలను తయారు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలం క్రితం ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్ శ్రీరాం ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంకుల్లో ఇంటి లోన్, వ్యక్తిగత రుణాలు తీసుకున్నాడు. వాటికి సంబంధించిన ఈఎంఐలు చెల్లించకపోవడంతో రుణాలు ఇచ్చిన బ్యాంకులు, ఫైనాన్స్‌లకు సంబంధించిన వారు ఇంటితో పాటు దుకాణం వద్దకు వచ్చి ఈఎంఐలు చెల్లించాలని అడుగుతున్నారు. అందులో భాగంగా ఈ నెల 28న దుకాణం వద్దకు వచ్చి అడగడంతో మనస్తాపం చెందిన సాయంత్రం 4గంటల సమయంలో ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాల తయారీలో ఉపయోగించే సైనేడ్ తాగాడు. కొద్ది సేపటి తర్వాత గమనించిన భార్య చికిత్సనిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మధుసూదనాచారికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య పూర్ణిమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పోలేపల్లిరాంనగర్‌లో పోలీసులు సోదాలు

చింతపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న సమాచారంతో పోలీసులు నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ రాంమ్మూర్తి తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని పోలేపల్లిరాంనగర్ గ్రామశివారులో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న స్థావరాలపై దాడులు నిర్వహించారు. పోలేపల్లిరాంనగర్‌కు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి నాలుగు మోటర్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పేకాడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూగజీవాలను తరలిస్తున్న వాహనం పట్టివేత

త్రిపురారం జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కోడె దూడెలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ కైగూరి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన కోడెల గోకారి, లద్దగిరి రాములు, గొల్ల మల్లిఖార్జున్ మినీగూడ్స్ డీసీఎం వాహనంలో మూగజీవాలను అక్రమంగా కోదాడ నుంచి కర్నూలుకు తరలిస్తున్నారు. త్రిపురారంలో వాహన తనిఖీల్లో భాగంగా వాహనాన్ని పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. సూర్యాపేట జిల్లా కోదాడ సంతలో మూగజీవాలను కొనుగోలు చేసి వాటిని కర్నూల్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అశ్రునయనాల మధ్య సాంబశివరావు అంత్యక్రియలు

కోదాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ముంద్రా సాంబశివరావు మూడు రోజుల క్రితం మృతిచెందారు. సాంబశివరావు భార్య అమెరికాలో ఉన్నారు. భర్త మృతిచెందారన్న వార్త తెలియగానే శనివారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నారు. ఆదివారం రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అశ్రునయనాల మధ్య సాంబశివరావు అంత్యక్రియలను నిర్వహించారు. సాంబశివరావు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో అనేక పదవులు నిర్వహించారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే పద్మావతి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పార్టీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, ముంద్రా రంగారావు, నల్లపాటి నర్సింహారావు, మాజీ సర్పంచ్ సుశీల బెంజిమెన్, ఎంపీటీసీ క్రాంతికుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

మాఫీ కాకున్నా.. ఫ్లెక్సీలో పేర్లు


● తుమ్మలపల్లిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీతో రైతుల అయోమయం



అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నాంపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షలు రుణమాఫీ కాక కొందరు రైతులు ఇబ్బంది పడుతున్నారు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలోని రైతులు కొండమల్లేపల్లిలో గల అప్పటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. 520 మంది రైతులకు రూ.4.91 కోట్లు రుణమాఫీ అయినట్లు తుమ్మలపల్లి గ్రామంలో అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రుణమాఫీ అయిన రైతులు పేర్లు కాకుండా రుణమాఫీ కానీ రైతుల పేరు ఫ్లెక్సీలో ఉండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. నెలలో నాలుగు నుంచి ఐదుసార్లు బ్యాంకు చుట్టూ, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగినా బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులు రుణమాఫీ కాలేదని సమాధానం చెప్పేవారు. రుణమాఫీ జాబితాలో తమ పేర్లు ఉండడంతో తమ డబ్బులు ఎక్కడ పోయాయో అని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలోని 520 రైతుల పేర్లలో సుమారు 100 నుంచి 125 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఫ్లెక్సీలో ఎందుకు చేర్చారని రైతులు వ్యవసాయ అధికారులను అడిగితే వారి నుంచి సరైన సమాచారం రావడంలేదని వాపోతున్నారు.

సాంకేతిక సమస్యలతో నగదు జమ కాలేదు



రైతులు రుణాలు తీసుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా ఉన్న అప్పటి బ్యాంకు ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మారడం వలన కొన్ని సాంకేతిక సమస్యలతో రైతులకు నగదు జమకాలేదు. రుణమాఫీ కాని రైతుల పేర్లు జాబితాలో ఏలా వచ్చాయో తెలుసుకుంటా.

● శివ, మండల వ్యవసాయ అధికారి, నాంపల్లి

రుణాలు మాఫీ కాకుండా ఫ్లెక్సీలో మా పేర్లు ఎలా చేర్చుతారు



నాకు గ్రామంలో 4.30ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మలెపల్లిలో గల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు గతంలో వ్యవసాయ అవసరాల కోసం అప్పు తీసుకున్నాను. ఇప్పటి వరకు మొత్తం రూ2లక్షల రుణం ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రుణం మాఫీ కాలేదు. నాకు రుణమాఫీ అయినట్టుగా గ్రామంలో పెట్టిన ఫ్లెక్సీలో పేరు పెట్టారు.

● కందికట్టే నాగరాజు, రైతు తుమ్మలపల్లి.

సంతల నుంచి కబేళాలకు

గోవధపై నిషేధం ఉన్నా ఆగని పశువుల రవాణా

సంతలే కేంద్రాలుగా పశువులు కబేళాలకు తరలుతున్నాయి. గో సంరక్షణకు చట్టాలు ఉన్నా సరిగా అమలు కాకపోవడంతో పశువుల అక్రమ రవాణా ఆగడం లేదు. గోవులను వధించే చర్యలకు అడ్డుకట్ట వేస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన గో సంరక్షణ చట్టంపై జంతు ప్రియులు హర్షం వ్యక్తం చేశారు. అయినా గుట్టు చప్పుడు కాకుండా పశువుల అక్రమ రవాణా కొనసాగుతోంది. పోలీసులు, అధికారుల నిఘా కొరవడడంతో యథేచ్ఛగా కబేళాలకు తరలుతున్నాయి.

\- (ఆంధ్రజ్యోతి, బీబీనగర్)



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో పోలీసులకు పట్టుబడిన పశువుల వాహనం(ఫైల్)

యాదాద్రిభువనగిరి జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతునే ఉంది. సంతల నుంచి పశువులను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఒకే వాహనంలో మోతాదుకు మించి పశువులను కుక్కి రవాణా చేస్తున్నారు. కిలో మీటర్ల కొద్దీ తరలిస్తున్నారు. కనీసం తాగడానికి నీరు కూడా అందించడం లేదు. గోవులను, పశువులను తరలిస్తున్న వాహనాలపై గో సంరక్షణ నాయకులు నిఘా పెట్టి పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. పశువులు రవాణా చేసే వాహనాలను పోలీసులు పట్టుకొని జరిమానాలు విధిస్తున్నారు. లేదంటే నామమాత్రంగా కేసులు పెట్టి వదిలివేయడం పరిపాటిగా మారింది. సంతకు తీసుకొచ్చే పశువుల్లో అధికంగా కబేళాలకు తరలిస్తున్నారు. ఈ దారుణంపై జంతు ప్రేమికులు, గో సంరక్షణ సంఘాల నేతలు నిత్యం పోరాడుతునే ఉన్నారు.

రక్షణ కల్పించలేకపోతున్న చట్టం

గోవధను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రివెన్స్ ఆఫ్ క్రూఎల్టి టూ యానిమల్ (రెగ్యులేషన్ ఆఫ్ లైఫ్ స్టార్ మార్కెట్) రూల్స్ 2017 జూన్ 7వ తేదీన సవరణ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ చట్టం ప్రకారం గేదెలు, ఆవులు, కోడే దూడలు, ఎద్దులు లాంటివి వధించడానికి వీలు లేదు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు విధిస్తారు. ఈ చట్టం ప్రకారం పశువులను ఎక్కడపడితే అక్కడ విక్రయించడానికి వీలు లేదు. పశువుల సంతలు ఏర్పాటు చేయాలన్న మార్కెట్ కమిటీల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. పశుక్రయ విక్రయాల బాధ్యతలను మార్కెట్ కమిటీలకు అప్పగించింది. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. జిల్లా నుంచి ఏదో ఒక రూపంలో పశువులు, ఆవులు, వాహనా లలో కబేళాలకు తరలిపోతున్నాయి. ఒత్తిడి పెంచినప్పుడు మాత్రమే పోలీసులు హడావుడి చేస్తున్నారు. ఒకటో, రెండో గోవులు, పశువుల తరలింపు వాహనాలను పట్టుకుంటున్నారు. వీటిపై పోలీసులు నిఘా పెట్టాల్సి ఉంది.

వ్యవసాయ అవసరాలకు క్రయ, విక్రయాలు జరిపితే అభ్యంతరం లేదు



వ్యవసాయ పనుల అవసరాల నిమిత్తం పశువులను కొనుగోలు చేయవచ్చు. అందుకు ఎటువంటి అభ్యంతరాలు లే వు. సాధారనంగా అయి తే తొలకరి జల్లులు పడే జూన్ మాసంలో వ్యవసాయ పనుల కోసం సంతలో ఎద్దులు, దూడలు కొనుగోలు చేసుకోవచ్చు. పనులు ముగిసిన 6నెలల తర్వాత పశువులను సంతలో విక్రయించుకోవచ్చు. వ్యవసాయానికి ఉపయోగపడే, 14సంవత్సరాల లోపు వయసు ఉన్న పశువులను కబేళాలకు తరలించడానికి వీలు లేదు.

\- ఉషా పశువైద్యాధికారి బీబీనగర్

నిబంధనలు కఠినతరం

యాదాద్రిభువనగిరి జిల్లాలో ప్రధానంగా బీబీనగర్ మండలం కొండమడుగు, యాదగిరిగుట్ట, రామన్నపేట, చౌటుప్పల్, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి తదితర పట్టణాల్లో వారంతపు పశువుల సంతలు ఉన్నాయి. వీటిలో వారానికి కోట్ల రూపాయల్లో క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. వీటిలో అధిక శాతం పశు సంపద కబేళాలకు తరలిపోతుంది. సంతలో పశువులను వ్యవసాయ దారులకు మాత్రమే విక్రయించాలనే నిబంధన అమలులోకి తెచ్చింది.పశువులను కొనుగోలు చేసే వారు, విక్రయించే వారు తమ వివరాలను మార్కెట్ కమిటీల వద్ద పొందుపర చడంతో పాటు హామీ పత్రాలు తీసుకోవాలని కూడా ఆదేశించింది.

బాలుడి మృతిపై ఆందోళన

● న్యాయం చేయాలని కుటుంబసభ్యుల నిరసన ● పట్టించుకోని ఆస్పత్రి నిర్వాహకులు ● ఆస్పత్రి అద్దాలు ధ్వంసం



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు



సూర్యాపేటక్రైం, జూన్ 29, (ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడి మృతిచెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు సంబంధిత ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలంలోని గుడితండాకు చెందిన జాటోత్ జలంధర్-మనీషా దంపతులకు మొదటి సంతానంగా మూడు నెలల క్రితం బాలుడు జన్మించాడు. నాలుగు రోజుల క్రితం బాలుడికి వాంతులు చేసుకోవడం, జ్వరం రావడంతో చికిత్సనిమిత్తం సూర్యాపేటలోని ప్రైమ్ చిన్న పిల్లల ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. రెండు రోజులు బాలుడు మంచిగానే ఉన్నప్పటికి మూడో రోజు నుంచి బాలుడి ఆరోగ్యం బాగాలేదని తల్లిదండ్రులు వైద్యుడికి తెలిపినా పట్టించుకోలేదని కుటుంబసభ్యులు తెలిపారు. తీరా బాలుడి ఆరోగ్యం విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యుడు సూచించాడు. బాలుడిని చికిత్సకోసం ఖమ్మం ఆదివారం తీసుకెళ్లగా అక్కడ బాలుడిని పరీక్షించిన వైద్యులు బాలుడి పరిస్థితి విషమంగా ఉందని చికిత్స చేశారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో సూర్యాపేటలోని ఆస్పత్రిలో చికిత్స చేసిన వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆదివారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఆస్పత్రి నిర్వాహకులు పట్టించుకోవడంలేదని..

న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్నా ఆస్పత్రి నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆగ్రహం చెందిన ఆందోళనకారులు ఆస్పత్రి అద్దాలు పగలగొట్టారు. బాధితుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు భారీగా తరలిరావడంతో పరిస్థితి చేదాటిపోయింది. ఆందోళనచేస్తున్న వారిని పోలీసులు చెదరగొట్టారు. ఆందోళనకారులు పక్కనే ఉన్న రాళ్లను ఆస్పత్రిపైకి రువ్వారు. దీంతో అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ గుగులోత్ నరేష్ తలకు తీవ్రగాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అంతేకాకుండా న్యాయం చేయాలని కోరుతున్నా తమపై పోలీసులు లాఠీచార్జీ చేయడం ఏమిటని బాధిత సమీప బంధువు మహేందర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నం చేశాడు. గమనించిన పోలీసులు వెంటనే అతడిపై నీళ్లు పోసి అడ్డుకున్నారు.



ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

ఆస్పత్రికి చేరుకున్న పోలీసు అధికారులు

డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట ఇన్‌చార్జి సీఐ రాజశేఖర్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. జరిగిన విషయంపై బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. సామరస్యంగా మాట్లాడుకోవాలని ఆస్పత్రి నిర్వాహకులకు చెప్పారు. ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అంతేకానీ ఆందోళనలు చేయడం, ఆస్పత్రి అద్దాలు ధ్వంసం చేయడం, రాళ్లు రువ్వడం చేస్తే చర్యలు తప్పవని తెలిపారు. దీంతో ఆందోళనకారులు ఆందోళనను విరమించి ఆస్పత్రి నిర్వహకులతో జరిగిన విషయమై చర్చించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

● స్తంభం ఎక్కి వైరు సరిచేస్తుండగా ఘటన ● నల్లగొండ జిల్లా బచ్చాపురం గ్రామంలో విషాదం



కేతావత్ లస్కర్ మృతదేహం

నేరేడుగొమ్ము, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బోరు మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో స్తంభం ఎక్కి వైర్లను సరిచేస్తున్న రైతు విద్యుదాఘతంతో మృతిచెందాడు. ఆదివారం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం బచ్చాపురం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం... బచ్చాపురం గ్రామానికి చెందిన కేతావత్ లస్కర్(32) తనకున్న మూడు ఎకరాల్లో పత్తి, కూరగాయల సాగు చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం భార్య సులోచనతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. పొలానికి నీరు పెట్టేందుకు బావి వద్ద ఉన్న మోటార్‌ను ఆన్ చేసి నీరు రాకపోవడంతో సమస్య తెలుసుకునేందుకు ప్రయత్నించాడు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సరఫరా నిలిపివేసి వైరు సరిచేయడానికి విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్తంభంపై వైరును సరిచేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సులోచన కేకలు వేయడంతో సమీపంలోని రైతులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లస్కర్ భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటేష్ తెలిపారు.

ఆత్మ విశ్వాసమే ఆయుధంగా..



నల్లగొండ జిల్లాకేంద్రం శివారు పానగల్‌కు చెందిన రైతు హనుమంతు 15 ఏళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నా నిరాశ చెందకుండా చేతి కర్ర సహాయంతో సైకిల్ తొక్కుకుంటూ ప్రతిరోజూ పశువులను మేపేందుకు వెళ్తాడు. తనకు కుమారులు, కుమార్తెలు ఉన్నా పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ● స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ నల్లగొండ

కారు అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని..

బీబీనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... హెచ్‌ఆర్‌జడ్ బీ5 3618 నెంబరు గల కారులో చమన్‌సింగ్ మరో ముగ్గురితోకలిసి ఆదివారం తెల్లవారుజామున బ్రాహ్మణపల్లి నుంచి బీబీనగర్ వైపు వస్తుండగా గ్రామ శివారులోని దుర్గమ్మ దేవాలయ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు ఎగిరిపడింది. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక లైన్‌మెన్ స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞ సప్తాహం



ప్రవచనాలు బోధిస్తున్న చైతన్యానంద స్వామిజీ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి, పట్టణంలోని ప్రసిద్ధ మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞ సప్తాహం కొనసాగుతోంది. గీతాశ్రమ వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానంద స్వామిజీ వశిష్ట రామాయణం - మానవ జీవితంపై కైవల్యోపనిషత్, శ్రీమద్భగవద్గీత దైవాసుర సంపద్విభాగ యోగంపై ఆదివారం భక్తులకు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు డాక్టర్ సీత సత్యనారాయణ, ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి, అధ్యక్షులు బల్ల దుర్వాసులు, ఉపాధ్యక్షుడు సకినాల నాగయ్య, ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణ, సహాయకార్యదర్శి తడక అంజనేయులు పాల్గొన్నారు.

అవగాహన పెంచాలి

ఆధునిక కాలం, అనుబంధాలు మాయమైనట్లు కనిపిస్తోంది. మమతల్లేని మనుషులు రోజూ తారసపడుతున్నారు. తల్లిదండ్రులకు బుక్కెడు బువ్వ పెట్టని కాఠిన్యం కలచివేస్తోంది. అనుబంధాల కన్నా ఆస్తులకే ప్రాధాన్యం ఇస్తున్న ఉదంతాలు ఎన్నో కళ్ల ముందు కనిపిస్తున్నాయి. వయస్సు మీదపడిన వృద్ధులను పసివాళ్లుగా చూడాల్సిన సంతానం చీదరించుకుంటోంది. చట్టాలున్నప్పటికీ అవగాహన రాహిత్యం వృద్ధులను కష్టాల పాలు చేస్తోంది. అయితే ఈ చట్టాలపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రస్తుతం నెలకొంది.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)


తల్లిదండ్రులను వేధిస్తే చర్యలు తప్పవు



తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినట్లు, వేధించినట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవు. తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాల్సిన పిల్లలదేనని చట్టం చెబుతోంది. కన్న వాని భారంగా భావించడం సరికాదు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా నిలవాలి.

● శ్రీనివాస్‌నాయుడు, యాదగిరిగుట్ట ఏసీపీ

కుటుంబాల సమస్యలు పరిష్కరించాం



జిల్లావ్యాప్తంగా 400 కుటుంబాల సమస్యలను అధికారులతో పరిష్కరించాం. చట్టాలు వయో వృద్ధులకు అండగా ఉంటాయి. పోలీసులు ఇప్పటి వరకు 400 కుటుంబాలకు చెందిన పిల్లలపై కేసులు నమోదు చేశారు. పిల్లలు వేధిస్తే వెంటనే సంఘాన్ని సంప్రదించాలి.

● యెర్రగుంట వెంకటేశం, వయో వృద్ధుల యాదాద్రిభువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి.

2007లో ప్రత్యేక చట్టం వచ్చింది



వయో వృద్ధుల సంరక్షణ కోసం 2007 ప్రత్యేక చట్టం వచ్చింది. ఆ చట్టం ఆర్డీవో నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఉంటుంది. పిల్లలు తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం చేసినా వారిని ఇబ్బంది పెట్టినా దరఖాస్తు చేసుకోవాలి. కమిటీ ఆధ్వర్యంలో ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి.

● గుడ్ల స్వామి, సీనియర్ న్యాయవాది యాదగిరిగుట్ట

రాచకొండపై రైతుల ఆశలు

- రాచకొండగుట్టల్లో రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రతిపాదన
- శివన్నగూడెం ప్రాజెక్టు నుంచి లిఫ్టల ద్వారా రిజర్వాయర్లు నింపేందుకు ప్రణాళిక



ఎలాంటి సాగునీటి వనరులు లేని మునుగోడు నియోజకవర్గ రైతులు దేవుడిపై భారం వేసి పంటలు సాగు చేస్తున్నారు. కేవలం వర్షాధారంగానే వ్యవసాయం చేస్తున్నారు. మూడు, నాలుగు సంవత్సరాలుగా సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు కుంటలు ఎండిపోయాయి. భూగర్భజలాలు కూడా అడుగంటుతున్నాయి. బోర్లలో నీటిమట్టం తగ్గిపోతుండడంతో ఈ ప్రాంతంలో పంటల సాగు కూడా రోజురోజుకు తగ్గుతోంది. ప్రాజెక్టులు, సాగునీటి వనరులు లేక ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్)

మునుగోడు నియోజకవర్గంలో ముఖ్యంగా సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగు నీటి శాశ్వత సమస్య పరిష్కారానికి రాచ కొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ విన్పిస్తోంది. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాల్లో సాగు నీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజాప్రతినిధులు, రైతులు అభిప్రాయపడు తున్నారు. ఇటీవల నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాచకొండలో రిజర్వాయర్ల ఏర్పాటుకు సంబంధించి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. శివన్న గూడెం చర్లగూడెం వద్ద 12టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చర్లగూడెం వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ నుంచి 12 టీఎంసీల నీటి సామర్థ్యంతో రాచకొండలో రెండు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి.

పదేళ్ల కిందటే సర్వే

హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న రాచకొండగుట్టల్లో రిజర్వాయర్ ఏర్పాటు చేయడానికి పదేళ్ల క్రితమే సర్వే జరిగింది. ఈ ప్రాంత ప్రజల సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు హైదరాబాద్ నగర ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చేందుకు రాచకొండలో రెండు రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. సంస్థాన్‌నారాయణపురం మండలం రాచకొండలో ఒకటి, చౌటుప్పల్ మండలం దేవనమ్మ నాగారంలో మరో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రాథమికంగా సుమారు 5వేల ఎకరాల భూమి అవసరముందని అంచనా వేశారు. రాచకొండ గుట్టలో నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి సమగ్ర నివేదికను రూపొందించే బాధ్యతను ప్రభుత్వం వ్యాప్‌కోస్ సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు సర్వే కోసం జీవో 496/2018 జారీచేసింది.అంతేకాకుండా డీఆర్‌పీ తయారీకి రూ.1.72కోట్లు మంజూరు చేసింది. నాలుగు నెలల్లో డీఆర్‌పీ తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఆచరణలో అది అమలుకు నోచుకోలేదు.

మూడు నియోజకవర్గాలకు ప్రయోజనం

రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే నల్లగొండ, యాదాద్రిజిల్లాల్లోని మునుగోడు నియోజకవర్గం, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.ఈరిజర్వాయర్ ఏర్పాటు ద్వారా మునుగోడు నియోజకవర్గం లోని 10చెరువులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 20 చెరువులు. మొత్తం 30 చెరువులతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలోని మరికొన్ని చెరువులకు సాగునీటిని అందించేలా కార్యాచరణ తయారు చేశారు.

లిఫ్ట్ ద్వారా నీటి సరఫరా

రాచకొండ గుట్టల్లో నిర్మించతలపెట్టిన రిజర్వాయర్ నిర్మాణానికి చర్లగూడెం రిజర్వాయర్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అక్కడి నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు లిఫ్ట్ ద్వారా నీటిని తరలించవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుమారు 500మీటర్ల ఎత్తులో ఉన్న సంస్థాన్ నారాయణపురం మండలం వాయలపల్లి పై భాగాన రిజర్వాయర్ నిర్మించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. లిఫ్ట్ చేసిన నీటిని రోజుకు 0.10 టీఎంసీల చొప్పున 60 రోజులపాటు రాచకొండ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే అవకాశముంది. దీని ద్వారా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పల్లగట్టు తండా, మొలక చెరువు, చిల్లాపురంలోని పెద్ద చెరువు, నారాయణపురంలో మేళ్లచెరువు, జానకమ్మ చెరువు, కొత్తచెరువు, మహమ్మదాబాద్‌లోని చెరువులకు నీటిని నింపే అవకాశముంది.

చౌటుప్పల్ మండలంలోని నాగారం చెరువు, తంగడపల్లి చెరువు, మల్కాపురం చెరువు లాంటి చెరువులను నింపే అవకాశముంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆరుట్ల, బండనేమోరు, పటేల్ చెరువు, తాళ్లగూడెం, మంచాల, వనపర్తి. పోల్కంపల్లి, నోముల, లింగంపల్లి తదితర గ్రామాల్లోని చెరువులు నిండే అవకాశముంది. మహేశ్వరం నియోజకవర్గంలోని కర్తాల్, ముచ్చర్ల తదితర గ్రామాల్లో చెరువు కుంటలు నిండే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

శశ్వత పరిష్కారం లభించేనా?

ఒకవైపు ఫ్లోరైడ్, మరోవైపు సాగు జలాలు లేక బీడు భూములుగా మారిన నారాయణపురం, చౌటుప్పల్ మండలాల రైతుల్లో రిజర్వాయర్ ఏర్పాటు అంశంపై ఆశలు చిగురిస్తున్నాయి. కొండలు ఎత్తైన గుట్టల మధ్యన ఉన్న రాచకొండలో రిజర్వాయర్లు నిర్మిస్తే ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగి సాగు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఈ ప్రాంతం రైతులు, ప్రజలు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చొరవ

ఎలాంటి సాగునీటి వనరులు లేక ఇబ్బందులు పడుతున్న మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవ చూపుతున్నారు. ఇటీవల నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించారు. కేవలం వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్న ఇక్కడి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతానికి సాగునీటి సౌకర్యం కల్పించేందుకు రిజర్వాయర్ల ఏర్పాటుపై ఎమ్మెల్యే మంత్రి ఉత్తమ్‌కు వివరించారు. ఇటీవల మునుగోడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు.

లీలావతికి తెలంగాణతల్లి అవార్డు ప్రదానం



లీలావతిని అవార్డుతో సన్మానిస్తున్న దైవజ్ఞశర్మ

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు చీకూరి లీలావతిగౌడ్ తెలంగాణతల్లి ఐకాన్ అవార్డు అందుకున్నారు. సావిత్రీబాయిఫూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లీలావతిగౌడ్‌కు తెలంగాణతల్లి అవార్డును రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు, దైవజ్ఞశర్మ అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి సంఘం నాయకురాలిగా పోరాటం చేసిన నేపథ్యంలో ఆమెకు ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు బోయ గోపి, పరమేశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.

పంట కాల్వను ఆక్రమించిన వ్యాపారులు

కోదాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామ శివారులోని సర్వే నెం. 178లోని పంట కాల్వను కొందరు రియలెస్టేట్ వ్యాపారులు ఆక్రమించి, విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాకాలంలో వచ్చే వరదలను పొలాల మీదికి రాకుండా ఎప్పటినుంచో ఉన్నటువంటి పంట కాల్వను రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టిపోసి చదును చేశారని రైతులు ఆరోపించారు. కాల్వను పూడ్చడంతో వర్షాకాలంలో వరద వచ్చే సమయంలో వరద నీరు నిలిచి తమ పంటపొలాలు మునిగిపోతాయని పంటకాల్వను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు ఎస్‌ఎస్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్‌ఎస్పీ డీఈ సువర్ణరేఖ మాట్లాడుతూ పంట కాల్వను పూడ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నడుం బిగించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



విద్యార్థులకు షూ, టై బెల్ట్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు, శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యావంతులు నడుంబిగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కోతులారం గ్రామంలో కోతులారం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యావికాసం-2025 కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు, షూ, టై, బెల్ట్, ఆటలు, డిజిటల్ స్ర్కీన్, సీసీ కెమెరాలు, ట్యూషన్ టీచర్, అల్పాహారం సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. పోతులారం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ఇరుగు రవి, వివేకానంద ఉపాధ్యాయురాలు సాయి శ్రీ, అసోసియేషన్ సభ్యులు గుజ్జా ప్రవీణ్, కామటాల ప్రశాంత్, బంగారు చందు, కందుల రవికుమార్, జల శ్రీను, నర్సింహ, కొండూరి సైదులు, శంకర్, శివ, లింగస్వామి, జాజుల ప్రవీణ్ కుమార్, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌ను కలిసిన ప్రతినిధులు



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధులు

నల్లగొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర ఇన్‌చార్జి చైర్మన్ చింతపల్లి వెంకటేశ్వర్లు ఆదివారం హైదరాబాద్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ గోవర్ధన్ హాజరై పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా లీగల్ సెక్రటరీ ముక్కెర శ్రీనివాస్, జిల్లా వైస్ చైర్మన్ బిపంగి కిరణ్, జిల్లా కోఆర్డినేటర్ కట్ట గోవర్ధన్ హాజరై నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ భద్రతకు పెద్దపీట: ఈవో వెంకట్రావు



యాదగిరికొండపైన తన కార్యాలయంలో అధికారులతో సమీక్షలో ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆలయ భద్రతకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు సూచించారు. యాదగిరికొండపై తన కార్యాలయంలో ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కొండపైన సీసీ కెమెరాల మానిటరింగ్ సిస్టం పనితీరును పరిశీలించి మరింత మెరుగుపర్చేందుకు ఎస్పీఎఫ్ పోలీసులను ఆదేశించారు. భద్రత కట్టుదిట్ట పర్చేందుకు ఎస్పీఎఫ్, హోంగార్డు సిబ్బందిని మరింతగా పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధునిక పరిజ్ఞానంతో కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించి అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దేవస్థాన పరిధిలో వన మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని చెప్పారు. దేవస్థాన పరిధిలో ప్రణాళికాబద్ధంగా ఐదు ప్రాంతాల్లో మొక్కలను నాటేందుకు గుర్తించాలని సంరక్షించాలని సూచించారు. అందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. వాహన పూజలను కొండకింద రెండో ఘాట్ వద్ద ఖాళీ చేయడానికి సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. సమీక్షలో ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు గజ్వేల్లి రమేష్‌బాబు, జూశెట్టి కృష్ణ, ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఎలక్ర్టికల్ విభాగం ఈఈ ఊడెపు వెంకటరామారావు, పర్యవేక్షకుడు దాసోజు నరేష్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిల్ప కళాశాల, సంస్కృత విద్యాపీఠంలో కొత్తవారికి సదవకాశం: ఈవో

కొత్తగా ఆలయ నిర్మాణ శిల్ప కళలో ప్రావీణ్యం పొందే కొత్తవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని యాదగిరిగుట్ట ఆలయ ఈవో అన్నారు. తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో ఈ నెల 6న జరిగిన బహిరంగ సభలో యాదగిరిగుట్టలో విశ్వవిద్యాలయం స్థాయిలో విద్యా సంస్థ నెలకొల్పుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కొండకింద బస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప కళాశాలను ఈవో ఆదివారం పర్యవేక్షణ చేసి మాట్లాడారు. వైటీడీఏ ఆధ్వర్యంలో 2019 సంవత్సరంలో సర్టిఫికెట్ కోర్సులతో ప్రారంభించి మూడేళ్ల పాటు బీఏ ప్రవేశపెట్టిన కోర్సులను ప్రిన్సిపాల్ (స్థపతి) మోతీలాల్ వివరించారు. దేవాలయాల నిర్మాణం, వాస్తు, శిల్ప శాస్త్రం, ఆగమశాస్త్రంలో శ్లోకాల రూపంలో బోధించి డ్రాయింగ్ నేర్పించి ప్రాక్టికల్‌గా ఆలయ నిర్మాణం, విగ్రహాల తయారీ విధానంపై తర్ఫీదు ఇస్తామన్నారు. అదేవిధంగా సంస్కృత పాఠశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. 1952 సంవత్సరంలో ప్రారంభించిన సంస్కృత పాఠశాల 1954 సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతూ 2011 సంవత్సరంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ (నల్లగొండ) అనుబంధంగా కొనసాగుతోందన్నారు. సంస్కృతంతో పాటు ఆంగ్లం, తెలుగు, చరిత్ర, కంప్యూటర్ కోర్సులు బోధిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 75మంది విద్యార్థులతో కొనసాగుతుండగా ప్రథమ కక్ష్య (6వ, తరగతి) నుంచి ప్రీ డిగ్రీ కోర్సులతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కుల, మతాలకు అతీతంగా ఇక్కడి పాఠశాలలో విద్యా బోధన నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈవో వెంట డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో గజ్వేల్లి రఘు ఉన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.60 అడుగులు
టీఎంసీలు	134.4032
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	900 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.96 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.30 అడుగులు
టీఎంసీలు	3.55
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	6. 82 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	90.77క్యూసెక్కులు

ఇసుక జాతర.. నిబంధనలకు పాతర



ఇసుకను తరలించడానికి సిద్ధమైన ట్రాక్టర్లు

మోతె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు సరిగా కురవనందున పాలేరు జలాశయంలో నీరు తగ్గింది. దీంతో సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుకను రెండు నెలల నుంచి ఇష్టానుసారంగా అక్రమార్కులు తోడేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.15వేల చొప్పున టాక్టర్ నిర్వాహకులు, గ్రామాలకు చెందిన నాయకులకు ముట్టచెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో ఏటి వద్దకు పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లకుండా నాయకులు కట్టడి చేస్తున్నందున ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. సూర్యాపేట జిల్లాలోనే పాలేరు వాగు మోతె మండలంలోని నర్సింహాపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరేడువాయి, రంగాపురం తండా, రాయికుంటతండా, అన్నారిగూడెం, గోపతండా గ్రామాల పరిధిలో ఈ వాగు సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉంది. ఇక్కడి నుంచి నిత్యం 100ట్రాక్టర్లకు పైగాఇసుకను తరలిస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

.ఈ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లకు నంబరు ప్లేట్లు, పత్రాలు ఉండటం లేదు. మైనర్లు వాహనాలను నడుపుతున్నారు. ఏటికి ఆనుకుని ఉన్న రైతుల భూముల్లో నుంచి నిత్యం వందల ట్రాక్టర్లు వెళుతున్నందున గోతులు పడుతున్నాయి. వాగులో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల పైపులు, విద్యుత్ తీగలు, మోటార్లు ధ్వంసమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల ఉర్లుగొండ గ్రామానికి చెందిన ట్రాక్టర్ అతివేగంతో వెళుతూ ఢీకొట్టినందున ఓ వ్యక్తి మృతి చెందాడు. రంగాపురం తండ-నర్సింహాపురం గ్రామాలకు చెందిన వారు ఇసుక వాగుల వద్ద ఘర్షణలు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. మరోవైపు వాగులో రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తూ జాతరను తలపిస్తున్నా రెవెన్యూ, పోలీసులు, మైనింగ్, శాఖల అధికారులకు కనిపించడంలేదని రైతులు వాపోతున్నారు..నర్సింహాపురం గ్రామస్థులు ఇటీవల జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి వివరాలు ఇసుక ట్రాక్టర్ల యజమానులకు తెలియడంతో ఘర్షణలు జరుగుతున్నాయి.

రోజుకు లక్షల్లో విక్రయాలు

ఈ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి లక్షలు ఆర్జిస్తున్నారు.ఖమ్మం, నేలకొండపల్లి, కోదాడకు ఇసుకను రెండు నెలల నుంచి నిరాటంకంగా తరలిస్తున్నా, ఒక్క ఇసుక ట్రాక్టర్‌నైనా పట్టుకుని మైనింగ్‌కు అధికారులు అప్పగించిన ఒక్క ఘటన కూడా లేదు.

సీజ్ చేసినా ఆగని విక్రయాలు..

గతంలో ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన డంపులను విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు వంతెనకు ఆనుకుని వెళ్లడంతో రాళ్లు తేలాయి. దీంతో పిల్లర్లు కుంగే ప్రమాదం ఉందని గ్రామస్థులు భయపడుతున్నారు.

పైపులు ధ్వంసమవుతున్నాయి



వాగులో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇష్టానుసారం తరలిస్తున్నారు. దీంతో వాగుకు ఆనుకుని ఉన్న బోర్లు, విద్యుత్ మోటార్ల తీగలు, పైపులు ధ్వంసమవుతున్నాయి. ఇదేమిటని అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. ఇప్పటికే పైపులకు పలలుమార్లు మరమ్మతు చేయించా. ఇసుక ట్రాక్టర్‌తో మళ్లీ పైపులు ధ్వంసమయ్యాయి. ఈ విషయమై అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

● కట్ల వెంకన్న, వాగు వెంబడి రైతు

అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటాం. అక్రమాలకు పాల్పడితే . ఎంతటివారైనా చర్యలు తప్పవు.

● వేణుమాధవ్, ఆర్డీవో, సూర్యాపేట

బీసీ బిల్లును ఆమోదించాలి

నూతనకల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి చిత్త శుద్ధి ఉంటే బీసీ బిల్లును వెంటనే ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధునుం జయనాయుడు కోరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఐ. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపి మూడు నెలలైనా స్పందనలేదన్నారు.

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ : ఉదయం 3.30-4 గంటల వరకు
ఆరాధన : 4-4.30వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15-6.15, **పుష్పాలంకరణ సేవ:** 5.30-6.00
సహస్రనామార్చనలు: 6.15 నుంచి 7 గంటల వరకు
రాజభోగం: 11.45-12.30, మధ్యాహ్నం 3-4 గంటలవరకు ఆలయం మూసివేత
తిరువారాధన:సాయంత్రం 7-7.45, **సహస్రనామార్చన:**రాత్రి 7.30-8.15
ఆరగింపు: 9-9.45, **శయనోత్సవ దర్శనం:** 9.30- 9.45ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 6-7.30, 10-11.45 సాయంత్రం 5-7,రాత్రి 8.15-9
వీఐపీ దర్శనాల వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు

నేడు విద్యుత్‌సరఫరా నిలిపివేత

కనగల్, జూన్29:(ఆంధ్రజ్యోతి) : కనగల్ గ్రామ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం తిమ్మన్నగూడెం, తొరగల్లు, తుర్కపల్లి, దర్వేశిపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఆర్ఎన్‌జే కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్‌సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొబ్బరికాయల విక్రయానికి నేడు వేలం

చిట్యాలరూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వెలిమినేడు శివారులోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి, విక్రయించుకునేందుకు ఈ నెల 30వ తేదీన వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.2లక్షల డీడీని తీసి వేలంలో పాల్గొనాలని,వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సమాచారం

చిట్యాల పాల సంఘం అధ్యక్షుడిగా రవి

చిట్యాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా జిట్ట రవిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిట్ట రవి ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిని ఎమ్మెల్యే వేముల వీరేశం సన్మానించారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, నాయకులు ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేషం, కుక్కల మోహన్, దేశపాక రాజేష్. స్వామి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలసంఘం చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం

చిట్యాలరూరల్ : మండలంలోని ఆరెగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లు ఆదివారం ఎన్నికయ్యారు.. చైర్మన్‌గా నాగలగాని అండమ్మ, డైరెక్టర్లుగా కొలను యాదమ్మ, సప్పిడి సత్తమ్మ ఎన్నిక కాగా మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పెద్దకాపర్తి మాజీ ఉపసర్పంచ్ రాచమల్ల జానయ్యతో పాటు పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాగంపల్లి కిషోర్, సప్పిడి నర్సిరెడ్డి, మురాల శేఖర్, సప్పిడి యాదగిరి, రాచమల్ల తిరుమల, కొలను సత్తిరెడ్డి, ఆరూరు నర్సింహ, మోటె పవన్, ధరణి శ్రీనివాస్, మురాల దినేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలి

చిట్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించి న సంఘ సమావేశంలో ఆయన మాట్లా డారు. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలతో యువత చెడిపోతుందన్నారు. డ్ర గ్స్‌పై యువత అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావే శంలో డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి వడ్డగాని మహేష్, ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిర ణ్, నాయకులు గణేష్, మహేష్, భరత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల పంపిణీ

శాలిగౌరారం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10వేల విలువ గల ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుదన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, హెచ్ఎం రామచారి, విద్యా కమిటీ చైర్మన్ కల్యాణి, క్లబ్ ప్రతినిధులు దునక వెంకన్న, దామెర్ల శ్రీనివాస్, గుండు పరమేష్, రాపాక రాజు, ఉపాధ్యాయయులు ఏడుకొండల్, నాగయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత కవితకు లేదు

గట్టుప్పల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై మాట్లాడే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదని టీడీపీ మండల అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా పేరు మార్చుకొని దోచుకోవడం, దాచుకోవడం తప్ప మీరు రాష్ట్రానికి చేసిందేమీ లేదని అన్నారు. చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత మీ కుటుంబానికి లేదన్నారు. సమావేశంలో ఎండీ. పాషా, అంజయ్య, శ్రీకాంత్, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణం ఎప్పుడు పూర్తయ్యేనో?



చండూరులో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం

- చండూరులో నిధుల కొరతతో నిలిచిన పనులు
- ఆగిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

చండూరు జూన్ 29(ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీలో నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మొదట్లో ప్రారంభానికి హడావుడి చేసి పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చండూరు మునిసిపాలిటీలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు వెచ్చించింది.

పట్టణంలో వ్యవసా య మార్కెట్ యార్డు ఖాళీ స్థలంలో భవన నిర్మాణానికి పనులు ప్రారంభించారు. మంజూరై న నిధులు వరకే కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశాడు. మిగిలిన పనులను పూర్తి చేయాలంటే మరో రూ. 4.20కోట్లు నిధులు కావాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

రెండేళ్లయినా నిధులు లేవు

పట్టణంలో ప్రతీ శుక్రవారం సంత నిర్వహిస్తుంటారు. ఆ రోజు ట్రాఫిక్ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. ఈ సంతకు మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ, కనగల్, గుర్రంపోడు, మాల్, నల్లగొండ, నారాయణపురం, చౌటుప్పల్, గట్టుప్పల్ మండలాలకు చెందిన వ్యాపారులు క్రయ, విక్రయాల కోసం వస్తుంటారు. సంతకు వచ్చే వారికి కనీస సదుపాయాలు లేకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే మాంసం, కూరగాయలు, ఇతర విక్రయాలు జరుగుతుండటంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో 2023 జనవరి 6వ తేదీన సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి, అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా, భవన నిర్మాణం నేటికీ పూ ర్తి కాకపోవడంతో చిరు వ్యాపారులు, మాంసపు దుకాణదారులు రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు, ఆహార పదార్థాలు, మాంసం కలుషితమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీకృత మార్కెట్ భవనం నిర్మాణం పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా ఉంటుంది.

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం



ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మిగతా పనులు ప్రారంభిస్తాం. నిధులు ఉన్నంత వరకే పనులు జరిగాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తి కావాలంటే మరో రూ.4.20 కోట్లు నిధులు కావాల్సి ఉంది.

- నాగ దుర్గాప్రసాద్, ఏఈ, పబ్లిక్ హెల్త్

త్వరగా పనులు పూర్తి చేయాలి

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తి చేయాలి. నిధుల లేమితో నిర్మాణాలు చేపట్టకపోవడం సరైంది కాదు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

- నలపరాజు సతీష్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి, చండూరు

మందుబాబులకు అడ్డా.. పందులకు ఆవాసాలు...

భవన నిర్మాణం పూర్తి చేయకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పదుల సంఖ్యలో పందులు అక్కడే సేద తీరుతున్నాయి. కొందరు పందుల పెంపకందారులు పోటీపడి ఏకంగా నిర్మాణ సమీపంలో వాటిని తెచ్చి వదిలేస్తున్నారు. చెట్ల నీడలో సంచరిస్తున్న పందులు అక్కడే సంతతి పెంచుకుంటుండటంతో మార్కెట్ పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. వ్యవసాయ మార్కెట్ కావడంతో రైతులు పండించిన పంటను తీసుకువచ్చి విక్రయిస్తారు. ఈ స్థలం నిత్యం మందుబాబులకు అడ్డాగా మారడంతో అటు వైపు రైతులు రావడానికి ఆసక్తి కనపరచడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

డ్రగ్స్ రహిత సమాజస్థాపనే ధ్యేయం

కృష్ణారెడ్డి, ఎస్ఐ, మర్రిగూడ



డ్రగ్స్‌కు ఏ ఒక్కరూ బానిసలు కాకూడదనే లక్ష్యంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మర్రిగూడ ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు.

(మర్రిగూడ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్‌ను అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఐ: డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రజలతో మమేకమై దానిని నిర్మూలించడానికి చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: యువతీ యువకులు డ్రగ్స్‌కు బానిసలుగా కాకుండా ప్రత్యేకమైన అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్ఐ: మండల ప్రజలు, యువతీ యువకులతో ఫ్రెండ్లీపోలీస్‌గా ఉంటూ డ్రగ్స్‌కూ బానిసలు కావద్దు. మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాల్లో ప్రజలలో ఏ విధమైన స్పందన కనిపించింది?

ఎస్ఐ: డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాల్లో అటు ప్రజలు. ఇటు యువతీ యువకుల్లో మంచి స్పందన కనిపించింది. మండలంలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టగలుగుతామనే నమ్మకం ఉంది.

అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు

● **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

గట్టుప్పల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంతంపేట గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామంలో తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభిస్తూ, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేసే వాళ్లే సర్పంచ్, ఎంపీటీసీగా పోటీ చేయాలి, వాళ్లనే మీరు ఎన్నుకోవాలంటూ గ్రామస్థులకు సూచించారు. గ్రామంలో కాయా కష్టం చేసుకుంటూ గుడిసెలో జీవిస్తున్న రాములు ఇంటికి వెళ్లి పరిశీలించారు. రాములుకు ఇల్లు కట్టిస్తానని మాటిచ్చారు. ప్రభుత్వం తరఫున ఇచ్చే ఐదు లక్షలతో పాటు ఇల్లు పూర్తవడానికి మిగిలిన ఆర్థిక సాయం చేసి ఇంటిని నిలబెడతానని అన్నారు. సోమలింగమ్మ బాధను గడపలో కూర్చుని సావధానంగా విని కొడుకుకు ఫోన్ చేసి బాగా చూసుకోవాలని సూచన చేశారు. ఇప్పటికే మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు రాని అర్హులైన నిరుపేదలకు రెండోజాబితాలో ఇల్లు ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. వీధుల్లో తిరుగుతున్న సందర్భంలో కరెంటు లూజు లైన్స్, గృహాల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ కరెంట్ లైన్‌లను వెంటనే తొలగించాలని విద్యుత్ ఏఈని ఆదేశించారు. అంతంపేట నుంచి దేవులతండా, రాజ్యతండాకు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించారు. అంతంపేట నుంచి నామాపురం గ్రామానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, మర్రిగూడెం మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాములు, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, నాయకులు వీరమల్ల శ్రీశైలంగౌడ్, రావుల రమేష్, జగన్నాథం, ఆంజనేయులు పాల్గొన్నారు.



అంతంపేటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

కొలువు ఓ చోట.. విధులు నచ్చిన చోట

(5వ పేజీ తరువాయి)

పలు సెక్షన్లలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను కాదని, నచ్చిన చోట పనిచేస్తున్నారు. ప్రధానంగా చండూర్ సెక్షన్ పరిధిలోని బంగారుగడ్డ పోస్టింగ్‌లో ఉన్న లైన్‌మెన్ 17 ఏళ్లుగా చండూరు టౌన్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. విద్యుత్‌శాఖలో ఆయన ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఆయన అక్కడే కొనసాగుతున్నారు. అదేవిధంగా చండూరు టౌన్‌లో విధులు నిర్వర్తించాల్సిన లైన్‌మెన్ బోడంగిపర్తిలో పనిచేస్తున్నాడు. బోడంగిపర్తికి బదిలీపై వచ్చిన మరో లైన్‌మెన్ దోనిపాములలో విధులు నిర్వహిస్తున్నాడు. దీర్ఘకాలికంగా వీరంతా ఒకే చోట పనిచేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సబ్‌స్టేషన్ ఆపరేటర్లు సైతం ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కనపెడుతున్నారు. పుల్లెంల సబ్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఉన్న అసిస్టెంట్ చండూరు ఎస్ఎస్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదేవిధంగా గట్టుప్పల్ సబ్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఉన్న వ్యక్తి దోనిపాములలో, అక్కడ పనిచేస్తున్న ఆపరేటర్ గట్టుప్పల్‌లో పనిచేస్తున్నాడు. చీకటిమామిడి ఎస్ఎస్‌లో పోస్టింగ్ ఉన్న ఆపరేటర్ గట్టుప్పల్ ఎస్ఎస్‌లో, అక్కడ పోస్టింగ్ ఉన్న మరో వ్యక్తి చీకటి మామిడిలో పనిచేస్తున్నాడు. ఇలా ఎవరికి వారు ఇష్టానుసారంగా పనిచేస్తుండటంతో పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిబ్బంది వ్యవహారం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. దీనిపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం. గత ఏడాది బదిలీల ప్రక్రియ నేను విధుల్లో చేరక ముందుకే జరిగింది. అయితే పైఅధికారుల ఆర్డర్లను కిందిస్థాయి అధికారులు అమలు చేయాలి. కింది స్థాయిలో ఉన్న అధికారులు కొత్త వారు అవడంతో నిజానిజాలు తెలుసుకోవాల్సి ఉంది.

-అన్నయ్య, డీఈ ఆపరేషన్స్, నల్లగొండ

పాత వారుండరు..కొత్తవారికి ఇవ్వరు

(5వ పేజీ తరువాయి)

ఒప్పందం కుదుర్చుకోగా, మరి కొందరు 25 ఏళ్ల వరకు అగ్రిమెంట్ చేసుకున్నామని చెబుతుండగా, ఏ దుకాణానికి ఎన్ని సంవత్సరాలకు అగ్రిమెంట్ ఉందో తెలిపే పత్రాలను భద్రపర్చడంలో మునిసిపల్ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గడువు తీరిన మడిగలను, సబ్‌లీజులకు ఇచ్చిన వాటిని ఖాళీచేయించి కొత్తగా టెండర్‌లు పిలవకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నోటీసులతోనే సరి

మునిసిపల్ కాంప్లెక్స్ దుకాణాలు సబ్‌లీజులకు ఇచ్చారని, అగ్రిమెంట్‌ను రద్దు చేసి తిరిగి టెండర్లు పిలవాలని కొందరు 2012లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో నాటి మునిసిపల్ కమిషనర్ విచారణ నిర్వహించి 22 మడిగెల్లో మాత్రమే లీజుదారులు ఉన్నారని, 66 మడిగెలు సబ్‌లీజుకు ఇచ్చినట్లు గుర్తించి వారిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఇప్పటి వరకు ఖాళీచేయకపోగా, లీజు గడువు తీరిన వారిని సైతం ఖాళీ చేయడం లేదు. నూతన టెండర్లు పిలవకుండా కొందరు రాజకీయ నేతలు, వ్యాపార ప్రముఖులతో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దుకాణాలు పొందినవారు సబ్ లీజు సమయంలో అడ్వాన్స్ పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. సుమారు 20 దుకాణాలను ఇలా వసూలు చేసి అద్దెకు ఇచ్చినట్లు తెలిసింది.

కౌన్సిల్ తీర్మానం చేసినా

నూతన టెండర్లకు అధికారులు మూడుమార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఈ ప్రక్రియ ముందుపడకుండా రాజకీయ పలుకుబడితో నిలిపివేయించారనే ఆరోపణలు ఉన్నాయి. 2018లో మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చించి సబ్‌లీజుగా ఉన్న 66 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. దీంతో పలువురు రూ.25వేల చొప్పున డీడీలు చెల్లించి 37 దుకాణాలను రూ.1,44,87,000కు దక్కించుకున్నారు. అయితే పాత వారు హైకోర్టును ఆశ్రయించడంతో టెండరు ప్రక్రియ నిలిచింది. నిబంధనలకు లోబడి 88 మడిగెలకు 33శాతం అద్దె పెంచి నేటికీ అదే వసూలు చేస్తున్నారు. మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు పార్టీకి ఒకరు చొప్పున ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి మడిగెల రీటెండర్ వ్యవహారంపై చర్యలు చేపట్టాలని సూచించినా అది కార్యరూపం దాల్చలేదు. 2024లో హైకోర్టు అనుకూలంగా తుది తీర్పు వెలువరించినా, నేటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అంతేగాక దుకాణదారులు సుమారు రూ.60లక్ష వరకు అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. 2015లో మొదటి అంతస్తులో 90 మడిగెలు నిర్మించగా, వాటికి టెండర్లు పిలవకపోవడంతో అవి వృథా ఉన్నాయి.

పదేళ్లకోసారి టెండర్లు పిలవాలి



మునిసిపల్ కాంప్లెక్స్ కొందరి ఆధీనంలో ఉంచుకోవడం నిబంధనలకు విరుద్ధం. రాజకీయ ప్రయోజనాలకంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యం. ప్రభుత్వ దుకాణ సముదాయలకు ప్రతీ పదేళ్లకోసారి టెండర్లు పిలవాలి. 10శాతం పెంపుతో అద్దెలకు ఇవ్వాలి. దీంతో మునిసిపాలిటీకి ఆదాయం వస్తుంది.

-వేనేపల్లి పాండురంగారావు, మట్టి మనుషుల వేదిక కన్వీనర్

పై అధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఇటీవలే నూతన కమిషనర్‌గా చార్జ్ తీసుకున్న. షాపింగ్ కాంప్లెక్స్ సమస్యను అధికారులు నా దృష్టికి తెచ్చారు. మునిసిపల్ ఆదాయానికి గండిపడుతుంటే చూస్తూ ఊరుకోం. సమగ్ర నివేదిక రూపొందించి పైఅధికారులకు నివేదిస్తా. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

జి.శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ఘనంగా నేతి జన్మదిన వేడుక

కేతేపల్లి, జూన్ 29: శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జన్మదిన వేడుకలు కేతేపల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, పర్వయ్య, కాంగ్రెస్ నాయకులు మట్టి సాల్మన్, జె.వెంకటనర్సయ్యయాదవ్, బీరం జాన్‌రెడ్డి, ఎన్.మంగమ్మ, ఎ.వీరాచారి, ఎ.మహేందర్‌రెడ్డి, ఆంధ్రయ్య, ఎ.వెంకట్‌గౌడ్, నిర్మల, ఎ.సురేష్. చిన్నప్ప పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

పెండెం సాహిత్యసేవ చిరస్మరణీయం



జగదీశ్వర్ జాతీయ పురస్కారాన్ని కృష్ణకుమారికి అందజేస్తున్న సాహితీ వేత్తలు

నల్లగొండ కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బాల సాహితీరత్న పెండెం జగదీశ్వర్ బాల సాహిత్యానికి చేసిన కృషి చిరస్మరణీయమని ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ అన్నారు. పట్టణంలోని ఎంవీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పెండెం జగదీశ్వర్ స్మారక 6వ జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహిత్యాన్ని ప్రతీ పాఠశాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారాన్ని విజయవాడకు చెందిన ప్రముఖ బాలసాహితీ వేత్త ముంజలూరి కృష్ణ కుమారికి అందజేశారు. ఈ పురస్కారం కింద రూ.5వేల నగదు, శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత కృష్ణకుమారి మాట్లాడుతూ జగదీశ్వర్ పేరిట వారి స్నేహితురాలు పురస్కారాన్ని ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో బాల సాహిత్యంలో విశిష్ట కృషి చేసిన రచయితలకు అందజేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ తండు కృష్ణకౌండిన్య అధ్యక్షతన జరిగన ఈ కార్యక్రమంలో రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి, సాహితీ వేత్తలు గోవర్ధన్, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, పగడాల నాగేందర్, పెందోట సోము, బండారు శంకర్, మాదగాని శంకరయ్య, శ్రీనివాస్, యాదగిరి, వెంకటేష్, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

● **మునిసిపల్ మాజీ చైర్మన్, క్రెడాయి ప్రెసిడెంట్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి**

నల్లగొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): క్రెడాయి నల్లగొండ చాప్టర్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని మునిసిపల్ మాజీ చైర్మన్, క్రెడాయి ప్రెసిడెంట్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో క్రెడాయి నల్లగొండ చాప్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాంటీ డ్రగ్స్ కార్యక్రమాలను విస్తృతం చేయాలని, అలాగే ప్రతి ఏటా ఇంజనీరింగ్ డేను కూడా నిర్వహించాలని సూచించారు. జూలై 13వ తేదీన క్రెడాయి నల్లగొండ చాప్టర్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని, ఈ మేరకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. క్రెడాయి సభ్యులను భాగస్వామ్యం చేస్తూ హరితహారం, హెల్త్ క్యాంపులు, వేసవిలో చలివేంద్రం వంటివి కొనసాగించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు ప్రసాద్, నాయకులు ఆమంచి రామలింగం, నాంపల్లి మనోహర్, ఏచూరి భాస్కర్, వెంకట్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, పవన్ కుమార్, సతీష్, శ్రీధర్‌రెడ్డి, రమేష్, మేకల యాదయ్య, సోమిరెడ్డి, పృథ్వీ, మిర్యాల స్వామి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్ రెడ్డి


పేదలకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మునుగోడురూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పేదలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంభంశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్ఫూర్తితో పేదలకు ఎంతో కొంత సహాయం చేయాలనే ఉద్దేశంతో ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన రావుల వెంకటమ్మకు ఉండటానికి నివాసం లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లు కల్పించి ఇంటి నిర్మాణానికి రూ.40వేలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, మాజీ సర్పంచ్ పగిల్ల బిక్షం, మాజీ ఉపసర్పంచ్ కుంభం యాదగిరిరెడ్డి, బొందు రవి, బిక్షం, మేక మధుసూదన్‌రెడ్డి, బిక్షంరెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కుంభం శ్రీనివాస్ రెడ్డి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 30 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	125
డ్రెస్	180
స్కిన్‌లెస్	210
గుడ్లు డజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	24.2

వరుణుడి కరుణ కోసం



ఈ ఏడాది ముందస్తుగా తొలకరి మురిపించడంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేయగా, ఆయకట్టు రైతులు బోరుబావులు, చెరువుల ఆధారంగా నారు తయారు చేసుకోవడంలో తలమునకలయ్యారు. జూలై రెండోవారంలో వరినాట్లు మొదలుపెట్టేందుకు వీలుగా నారు మళ్లు సిద్ధం చేశారు. అయితే వారం రోజులుగా ప్రతికూల వాతావరణం ఎండాకాలాన్ని తలపిస్తోంది. దీంతో రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ అర్బన్, దేవరకొండ) 8

రాచకొండపై రైతుల ఆశలు



సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీటి శాశ్వత సమస్య పరిష్కారానికి రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే రాచకొండలో రిజర్వాయర్ విషయాన్ని ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. - (ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్) 7



లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడికి ఆదివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు కొనసాగాయి. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలోనూ నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. ఆదివారం వారంతపు సెలవు అయినప్పటికీ హైదరాబాద్‌లో బోనాల పండుగ కావడంతో యాదగిరిగుట్ట క్షేత్రానికి భక్తుల రాక స్వల్పంగా తగ్గింది. ఉదయం, సాయంత్రం, బ్రేక్ దర్శనం, ఆరగింపు సమయాల్లో సుమారు 3 గంటల పాటు భక్తులు నిల్చోవడంతో క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. సుమారు 46వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.51,93,737 ఆదాయం సమకూరింది.

పాత వారుండరు.. కొత్తవారికి ఇవ్వరు

పురపాలిక ఆదాయానికి గండి ▸▸ మునిసిపల్ మడిగెల దుర్వినియోగం




మిర్యాలగూడలోని ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్

ప్రజాధనం వెచ్చించి నిర్మించిన మునిసిపల్ మడిగెలు దుర్వినియోగం అవుతుండగా, పురపాలిక ఆదాయానికి గండి పడుతోంది. మిర్యాలగూడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఎన్టీఆర్ షాపింగ్ సముదాయంలోని గదుల అద్దె అగ్రిమెంట్ గడువు తీరినా, కొత్తవారికి కేటాయించడం లేదు. గతంలో టెండర్ల ద్వారా దుకాణాలు పొందిన వారు లక్షల రూపాయలకు వాటిని ఇతరులకు అద్దెకు ఇస్తున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.
- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో 2000లో ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌ను 90 దుకాణాలతో నిర్మించారు. మునిసిపాలిటీకి స్టోర్‌రూంల కోసం రెండు దుకాణాలు కేటాయించగా, 2001లో ఆరు షాపులు, 2002లో 60, 2004లో 22 దుకాణాలకు ఓపెన్ టెండర్లు పిలిచి రూ.2,400 నుంచి రూ.4,000 అద్దెకు ఇచ్చారు. కాగా, అందులో మూడోవంతు షాపులను టెండర్లలో దుకాణాలు పొందినవారు అధిక అద్దెకు సబ్‌లీజుకు ఇచ్చారు. ఏళ్లతరబడి అధికారులు అద్దె పెంచకపోవడంతో రాబడి భారీగా తగ్గింది. కొందరు దుకాణదారులు మూడేళ్లు, ఐదేళ్లకు లీజు..

- మిగతా 8వ పేజీలో...



కొలువు ఓ చోట విధులు నచ్చిన చోట

జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పైఅధికారుల నుంచి వచ్చిన బదిలీ ఆర్డర్లను సైతం పక్కన పెట్టి ఇష్టమైన చోట విధు లు నిర్వహిస్తున్నారు. బదిలీలు చేసిన ప్రాంతంలో విధులు నిర్వహించాల్సి ఉండగా, కొందరు లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు అంతర్గత ఒప్పందాలతో అక్రమంగా ఆదాయం వచ్చే ప్రాంతాల్లో తిష్ఠవేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/నల్లగొండ టౌన్)

- ▸▸ విద్యుత్‌శాఖలో ఇదోరకం దందా
- ▸▸ ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- ▸▸ ఏళ్లకొద్దీ అంతర్గత ఒప్పందాలతో విధులు
- ▸▸ మునుగోడు విద్యుత్ సబ్ డివిజన్‌లో ఆగమాగం

మునుగోడు విద్యుత్ సబ్ డివిజన్‌లోని చండూరు మండలంలో ముగ్గురు లైన్‌మెన్‌లు 17 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరికి బదిలీల సమయంలో స్థానచలనం జరిగినా, తిరిగి అదే ప్రాంతంలో పనిచేస్తుండటం గమనార్హం. బదిలీలకు సంబంధించిన రికార్డుల్లో మాత్రం వారు ఇతర ప్రాంతంలో పనిచేస్తున్నట్లు ఉన్నా, క్షేత్రస్థాయిలో మాత్రం వారికి సంబంధం లేని ప్రాంతంలో వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో అక్రమ ఆదాయం వస్తుండటంతో వారి మధ్య ఒప్పందాలు చేసుకొని పాత స్థానంలోనే పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో పరిచయాలు పెరగడం, అక్రమంగా ఆదాయం వస్తుండటంతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని ఎక్కడివారు అక్కడే ఉంటూ, బదిలీ చేసినా ఏళ్లకొద్దీ అదే ప్రాంతంలో తిష్ఠవేసి ఉంటున్నారు. ఈ విషయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?..

బదిలీలు జరిగితే సదరు లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు వారికి కేటాయించిన ప్రాంతానికి వెళ్లి విధుల్లో చేరాలి. అయితే వీరంతా ఆర్డర్ కాపీతో జాయిన్ కావడం మినహా వారికి కేటాయించిన ప్రాంతంలో మాత్రం పనిచేయడం లేదు. ఇంత జరుగుతున్నా ఈఈలు, డీఈలు, ఇతర ఉన్నతాధికారులు ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదో తెలియడం లేదు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగితే ఎవరుబాధ్యత వహించాల్సి ఉంటుందో అర్థం కాని పరిస్థితి. ప్రమాదం జరిగితే ఆ ప్రాంతం తమది కాదంటే, తమది కాదని తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ సమస్యలు ఏర్పడినప్పుడు, స్తంభాలు ఒరిగినప్పుడు, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలినప్పుడు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సమాచారం ఇస్తే సమస్య పరిష్కారం కావడంలేదని, డబ్బు ఇస్తేనే పట్టించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిరంతరం సబ్ డివిజన్‌ను పర్యవేక్షణ చేస్తున్న సమయంలో రికార్డుల ప్రకారం ఆయా ఉద్యోగులకు ఫోన్ చేసే ఉన్నతాధికారులకు సైతం ఎందుకు అనుమానం రావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పై అధికారులకు ముడుపులు ముట్టడం వల్లే పట్టించుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోస్టింగ్ ఓ చోట.. పనిచేసేది మరో చోట..

జిల్లాలోని మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని..

- మిగతా 8వ పేజీలో..

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

డిండి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల 15వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఆర్థిక, అసమానతలులేని సమాజం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. ఓట్లు, సీట్లతో సంబంధంలేకుండా ప్రజా సమస్యలే ఎజెండాగా, నిత్యం ప్రజల మధ్య ఉండి సీపీఐ పోరాడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తుందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, బొడ్డుపల్లి వెంకటరమణ, ఎండీ మొయినొద్దీన్, బుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, తిప్పర్తి విజయేందర్‌రెడ్డి, బొల్లె శైలేజ్, బొడ్డుపల్లి రాజేందర్‌శర్మ, నూనె వెంకటేశ్వర్లు, కేశవులు, హుస్సేన్ పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కనకచారి: సీపీఐ మండల కార్యదర్శిగా తిరిగి రెండోసారి శ్రీరామదాసు కనకచారిని ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా బొల్లె శైలేజ్, టి.విజేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి మాట్లాడుతూ పార్టీ నిర్మాణానికి, బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న పోచారం

గోపలాయపల్లిలో మాజీ స్పీకర్ పూజలు



ఆలయంలో స్నేహితులతో కలిసి పోచారం శ్రీనివాసరెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్త, 1965లో నిజామాబాద్‌లో చదువుకున్న తన మిత్రుడైన కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు పోచారం తన స్నేహితులతో కలిసి ఆలయ సందర్శనకు వచ్చారు. వారంతా వేణుగోపాలస్వామి ఆలయ మూలవిరాట్టు వద్ద ప్రత్యే క పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పోచారం శ్రీనివాసరెడ్డికి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అందరూ వయసుకు.. పెళ్లికి... షష్టిపూర్తి చేసుకుంటారు.. మేము మాత్రం స్నేహితులుగా షష్టిపూర్తి చేసుకుంటున్నామని చమత్కరించారు.శ్రీనివాసరెడ్డి వెంట ఆయన స్నేహితులు రమేష్‌రెడ్డి,జనార్ధన్‌రెడ్డి, రవీందర్,మహిపాల్, నర్సింహారెడ్డి, శాంతకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెర్వుగట్టుకు శైలజా రామయ్యర్

నార్కట్‌పల్లి,జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ నార్కట్‌పల్లి మండలంలోని పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి సోమవారం రానున్నారు. ఎండోమెంట్ కమిషనర్ వెంకట్రావు, కలెక్టర్ ఇలాత్రిపాఠీతో కలిసి ఆమె దేవస్థానంలో అభివృద్ధిపై సమీక్షించనున్నారు. ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో గుట్టపై అభివృద్ధి, ఆలయ నిర్వహణ తదితర అంశాలతో ఇప్పటికే నివేదికను సిద్ధం చేశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు బక్కా శ్రీనివాసచారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు సకాలంలో అందించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల అవసరం మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. పీఆర్సీ గడువు తీరినందున రిపోర్టు వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి మాట్లాడుతూ జూలై చివరి నాటికి సంఘం సభ్యత్వం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం,ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, బి.అరుణ, కోశాధికారి వడిత్య రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, గేర నరసింహ, యాట మధుసూదన్‌రెడ్డి, రమాదేవి, నలపరాజు వెంకన్న, చిన వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మునుగోడు ఎంజేపీలో విద్యార్థినులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యేకు పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా తమకు సరిపడా భోజనం వడ్డించటం లేదని చెప్పటంతో నిర్వాహకులతో మాట్లాడారు. మరోసారి ఫిర్యాదు రాకుండా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యుత్ సమస్య కారణంగా నీటి సరఫరాపై సరిగా కావడంలేదని ఆయన దృష్టికి తీసుకురాగా, ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మర్రిగూడ మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎల్లమ్మ తల్లికి ఆషాడ బోనాలు



కనగల్, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాడమాసం ప్రారంభమైన దృష్ట్యా పలువురు భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

వివాహేతర సంబంధం అంటగట్టారని..


- ఇద్దరి బలవన్మరణం 14

'చంద్రబాబును విమర్శించే అర్హత కవితకు లేదు'

మిర్యాలగూడ టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదని టీడీపీ ఓబీసీ విభాగం రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. పట్టణంలోని సుందర్‌నగర్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కాంలో ఊసలు లెక్కపెట్టిన కవిత అభివృద్ధి ప్రదాత చంద్రబాబును విమర్శించడం సరికాదన్నారు. కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. రాజకీయ లబ్ధి, ప్రజల సానుభూతి పొందాలని విమర్శలు చేస్తే సహించేది లేదని అన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

దేవరకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ దేవరకొండ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దేవరకొండ మునిసిపాలిటీలో అన్ని వార్డుల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి జాబితాను వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరారు.



వరుణుడి కరుణ కోసం..

- చినుకురాలక అన్నదాతల్లో ఆందోళన
- ఎండుతున్న నారుమళ్లు, పత్తి పంట
- వేడిగాలుల దాటికి దెబ్బతింటున్న మొలకలు
- ప్రతికూల పరిస్థితుల్లో రైతాంగం

ఈ ఏడాది ముందస్తుగా తొలకరి మురిపించడంతో సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆనందంతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేయగా, ఆయకట్టు రైతు లు బోరుబావులు, చెరువుల ఆధారంగా నీరు, నారు తయారు చేసుకోవడంలో తలమునకలయ్యారు. జూలై రెండోవారంలో వరినాట్లు మొదలుపెట్టేందుకు వీలుగా నారుమళ్లు సిద్ధం చేశారు. అయితే వారం రోజులుగా ప్రతికూల వాతావరణం ఎండాకాలన్ని తలపిస్తోంది. రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు వానాకాలం సీజన్‌లో మెట్టపంటగా సాగైన పత్తి గింజలు మొలకెత్తే దశలో భూమిలోనే మాడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్, దేవరకొండ)

నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాల్లోని మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం మండలాల పరిధిలోని రైతులు బోరుబావులు, చెరువు నీటి ఆధారంగా వరి నారుమడిని సిద్ధం చేసుకున్నారు. మరోవైపు శ్రీశైలం జలాశయం వైపు కదిలొస్తున్న కృష్ణమ్మను చూసి రైతాంగంలో ఆశలు మొలకెత్తాయి. ప్రాజెక్టులు నిండి సాగు నీటి విడుదల చేస్తారన్న ఆశతో రైతులు ఉన్నారు. అయితే వారం రోజులుగా చినుకు రాలకపోవడతో వాతావరణం చల్లబడడం లేదు. ఎండతీవ్రతతో పాటు వీస్తున్న వేడిగాలుల ధాటికి వరి గింజ మొక్క తట్టుకోలేక వాడుతోంది. గతంలో కంటే భిన్నమైన వాతావరణ పరిస్థితులు తలెత్తి సాగు పనులు ముందుకు సాగడం లేదంటూ రైతులు చెబుతున్నారు. కూలీల కొరతను అధిగమించాలంటే జూలై నెలాఖరులోనే నారుమళ్ల సిద్ధం చేసుకోవాలని రైతులు భావిస్తున్నా ప్రస్తుత పరిస్థితులు అనుకూలించ రైతులు ఉక్కిబిక్కిరవుతున్నారు.

రైతులపై విత్తనభారం

కార్తెల బలాన్ని గుర్తించి రైతులు పంటసాగు పనులు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఆరుద్ర కార్తె తొలిదశలో రైతులు వరిసాగు పనులు షురూ చేశారు. విత్తనాలు సేకరించి నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. అయితే తయారైన నారుమళ్లను వేడిగాలులు దెబ్బతీయడంతో రైతాంగంపై విత్తనభారం పడుతోంది. కొన్నేళ్లుగా సన్నరకం విత్తనాలు రైతులు ఎంచుకుంటున్నారు. ఈ సీజన్‌లో అత్యధికంగా 101, చిట్టిపొట్టి, మహీంద్ర 505, పూజ తదితర ప్రైవేటు కంపెనీల విత్తనాలకు ప్రాధాన్యమిచ్చారు. బహిరంగ మార్కెట్లో 10కిలోల విత్తనాలను రూ. 1200లకు డీలర్లు విక్రయిస్తున్నారు. ఎకరాకు 15 కిలోల చొప్పున వరి విత్తనాలు సేకరించి తయా రు చేసుకున్న నారుమళ్ల ప్రతికూల వాతారణ పరిస్థితిని తట్టుకోలేక చనిపోతున్నా యి. దీంతో మళ్లీ విత్తనాలు సేకరించి నారుమడిని తయారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యం లో రైతాంగానికి ఆదిలోనే కష్టాలు వచ్చినట్లు విత్తనాల పెట్టుబడి భారాన్ని భ రించాల్సి వస్తోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులకు పలు రకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

వాడుతున్న పత్తి పంట

వర్షాలు కురవకపోవడంతో మెట్ట పంటగా సాగు చేసిన పత్తి పంట ఎండుతోంది. దీంతో పత్తి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో 1.40 వేల ఎకరాల్లో పత్తి సాగు చే శారు. విత్తనాలు మొలకలు వస్తున్నా వరుణుడు ముఖం చాటేయడంతో మొలకలు ఎండుదశకు చేరుతున్నాయి. నీటి వనరులు ఉన్న రైతులు స్పింకర్లతో పత్తి పంటను కాపాడుకుంటున్నారు. దేవరకొండ డివిజన్‌లో అత్యధికంగా పత్తిసాగుపైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎకరానికి రూ.10వేలకు పైగా పెట్టుబడులు పెట్టి రైతులు విత్తనాలు వేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే వేసిన విత్తనాలు ఎండిపోయి మళ్లీ రెండోసారి విత్తనాలు వేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మిర్యాలగూడలో రైతులు తయారు చేసుకున్న వరినారు మడి

ఎనిమిది ఎకరాల నారు చనిపోయింది



మండెకట్టిన మూడు రోజులకు వరిగింజ మొ లక బాగానే వచ్చింది. నీరునారు పెంచేందుకు నారుమడిలో మొలకలు వేశా. మొక్కదశకు చేరుతున్న క్రమంలో వేడిగాలుల ధాటికి ఎనిమిది ఎకరాల నారు వాడుపట్టి చనిపోయింది. సుమారు రూ.14 వేల పెట్టుబడితో సాగుచేసిన నారు ఆదిలోనే చనిపోయింది. విధిలేని పరిస్థితిలో మళ్లీ విత్తనాలు కొనుగోలుచేసి నారుపోయాల్సి వచ్చింది.

- నారాయణ శేఖర్‌రెడ్డి, రైతు, వేములపల్లి

నారుమడిలో తేమ ఉండేలా చూసుకోవాలి



నీటి వనరుల ఆధారంగా తయారు చేసుకున్న నారుమడిలో తేమశాతం ఉండేలా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళలో నీరుపెట్టి బయటకు తీయడంతో మొలకలు దెబ్బతినే అవకాశం ఉండదు. వరినారు తొలిఆకు వచ్చేంత వరకు రైతులు జాగ్రత్తపడాలి. జూలై 10 వరకు వానాకాలం నారు తయారు చేసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగుపనులు చేపట్టాలి.

- డి. సైదానాయక్, ఇన్‌చార్జి, ఏడీఏ, మిర్యాలగూడ

గోవర్ధానాచారికి డాక్టరేట్ పురస్కారం



మిర్యాలగూడ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు పగిడిమర్రి గోవర్ధనాచారి డాక్టరేట్ అందుకున్నారు. దశాబ్దాల కాలంగా వైద్య, సామాజిక సేవల్లో గోవర్ధనాచారి పోషిస్తున్న పాత్రను గుర్తించిన ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఈ పురస్కారం అందజేసింది. కరోనా సమయంలో క్వా రంటైన్‌లో ఉన్నవారికి అందించిన సేవలకు గుర్తింపు లభించిందన్నారు.

కొలువు ఓ చోట.. విధులు నచ్చిన చోట

(5వ పేజీ తరువాయి)

పలు సెక్షన్లలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను కాదని, నచ్చిన చోట పనిచేస్తున్నారు. ప్రధానంగా చండూర్ సెక్షన్ పరిధిలోని బంగారుగడ్డ పోస్టింగ్‌లో ఉన్న లైన్‌మెన్ 17 ఏళ్లుగా చండూరు టౌన్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. విద్యుత్‌శాఖలో ఆయన ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఆయన అక్కడే కొనసాగుతున్నారు. అదేవిధంగా చండూరు టౌన్‌లో విధులు నిర్వర్తించాల్సిన లైన్‌మెన్ బోడంగిపర్తిలో పనిచేస్తున్నాడు. బోడంగిపర్తికి బదిలీపై వచ్చిన మరో లైన్‌మెన్ దోనిపాములలో విధులు నిర్వహిస్తున్నాడు. దీర్ఘకాలికంగా వీరంతా ఒకే చోట పనిచేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సబ్‌స్టేషన్ ఆపరేటర్లు సైతం ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కనపెడుతున్నారు. పుల్లెంల సబ్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఉన్న అసిస్టెంట్ చండూరు ఎస్ఎస్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే విధంగా గట్టుప్పల్ సబ్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఉన్న వ్యక్తి దోనిపాములలో, అక్కడ పనిచేస్తున్న ఆపరేటర్ గట్టుప్పల్‌లో పనిచేస్తున్నాడు. చీకటిమామిడి ఎస్ఎస్‌లో పోస్టింగ్ ఉన్న ఆపరేటర్ గట్టుప్పల్ ఎస్ఎస్‌లో, అక్కడ పోస్టింగ్ ఉన్న మరో వ్యక్తి చీకటిమామిడిలో పనిచేస్తున్నాడు. ఇలా ఎవరికి వారు ఇష్టానుసారంగా పనిచేస్తుండటంతో పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిబ్బంది వ్యవహారం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. దీనిపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం. గత ఏడాది బదిలీల ప్రక్రియ నేను విధుల్లో చేరక ముందుకే జరిగింది. అయితే పైఅధికారుల ఆర్డర్లను కిందిస్థాయి అధికారులు అమలు చేయాలి. కింది స్థాయిలో ఉన్న అధికారులు కొత్త వారు అవడంతో నిజానిజాలు తెలుసుకోవాల్సి ఉంది.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

హాలియా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక సంక్షేమ చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విధంగా సంస్కరణలు చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. హాలియాలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సాగర్ నియోజకవర్గ సీఐటీయూ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నో పోరాటు చేసి సాధించుకున్న 44కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా కుదించారని విమర్శించారు. కార్మికులు సంఘం పెట్టడం, సమ్మె లు చేసే అవకాశం లేకుండా చేశారని, సమ్మె చేస్తే సస్పెండ్ చేసి కేసులు పెట్టే విధంగా పొందుపరిచారని విమర్శించారు. యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తీసుకొచ్చారని అన్నారు. ఒక వైపు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని, దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటు వ్యవసాయ రంగాన్ని, ఇటు వ్యవసాయ, ఉపాధిహామీ రంగాన్ని దెబ్బతీసే విధంగా పార్లమెంట్‌లో నిర్ణయాలు చేస్తున్నారని ఆరోపించారు. మోదీ అరాచక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, జిల్లా నాయకులు ఎస్.కె. బషీర్, వెంకట్కు, లక్ష్మమ్మ, నర్సిరెడ్డి, దుబ్బా చంద్రయ్య, రెబెల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ హుస్సేన్, చిరంజీవి, వేణుగోపాల్, సైదిరెడ్డి, నన్నెసాహెబ్, అన్నెపాక శ్రీను, అనూష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు ఉద్యమం

మిర్యాలగూడ: కార్మికుల హక్కుల చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతం రెడ్డి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రామ్మూర్తి అన్నారు. ఆదివారం హమాలీ వర్కర్స్‌కు ఆయన సమ్మె కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఐక్య ఉద్యమాల ద్వారానే కార్మికుల హక్కుల ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెకు సంఘటి త, అసంఘటిత రంగాలలోని కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని మ ద్దతు ఇవ్వాలని కోరారు. కార్యమంలో హమాలీ యూనియన్ నాయకులు అంజనరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనుముల మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓగిరాల శ్రీధర్ తల్లి ఓగిరాల లీలావతికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.42వేల చెక్కును ఆయన వారికి అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌ను విడుదల చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు విజయరామారావు, డాక్టర్ శ్రీధర్, మాజీ ఎంపీటీసీ అంజమ్మ సర్దార్, యడవల్లి రాంబాబు, తేరా హనుమంతు, మున్నాబ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఏకతాటిపైకి రావాలి

కొండమల్లేపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు మున్నూరుకాపులంతా ఏకతాటిపైకి రావాలని మున్నూరుకాపు సంఘం దేవరకొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోట్ల జగదీశ్‌పటేల్ అన్నారు. కొండమల్లేపల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపులంతా సమైక్యంగా న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని అన్నారు. మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ ఏర్పాటు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆమనగంటి కృష్ణ, బోయినపల్లి రాజు, లోకసాని నరేందర్, గోపర్ల శ్రీనయ్య, పాల్వా నిరంజన్, కోట్ల కృష్ణ, పెద్దిశెట్టి సుధాకర్, పన్నాల శ్రీనయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీసీ విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు పగిడి జీడయ్యాయాదవ్, తిరుమలగిరి అశోక్ తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల దోపిడీ మరీ దారుణంగా ఉందన్నారు. ప్రధానంగా రెండు పాఠశాలలు కేజీ విద్యకే రూ.85 వేలు ఫీజు దోచుకుంటున్నారని, అడ్మిషన్ ఫీజు పేరుతో మరో రూ.10వేలు వసూలు చేస్తున్నారని కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. పట్టణంలో విద్యా వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని సైతం అమలుచేయాలని కమిషనర్‌ను కోరగా తగిన విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, ఉపేందర్, శ్రీనివాస్, సైదయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అన్యాయం

కొండమల్లేపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్య మాదిగ ఆరోపించారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చింతకుంట్ల గ్రామంలో 400 మంది ఓటర్లు ఉన్న మాదిగలకు కనీసం ఒక్క ఇల్లు కూడా కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. మండల స్థాయి అగ్రకుల నాయకులు కుట్రపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయమై ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్‌మాదిగ, నాయకులు ఎదుళ్ల భిక్షమయ్య, మారపాక రాములు, పంది అంజయ్య, పంది యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

చింతపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభు త్వం పెద్దపీట వేస్తుందని మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్ అన్నా రు. మండలంలోని గొడకొండ్లలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీగా ఎన్నికైన అల్వాల జంగయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఇడకుళ్ల రాంమోహన్, పూజారి వైద్యుల ప్రవీణ్ కుమార్‌శర్మ, గ్యార ఉమా యాదయ్య, కదారి జంగయ్య, సురిగి వెంకటయ్య, మాజీ సర్పంచ్ అంగిరేకుల గోవర్ధన్, నాయకులు శ్రీకాంత్, మద్దెల కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

మాడ్గులపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. మండలంలోని ధర్మాపురం, కన్నెకల్, గోపాలపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆదివారం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, నిరుద్యోగులకు 60 వేల ఉద్యోగాలు, ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, అన్నదాతలకు రైతు భరోసా, రుణమాఫీ చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడలేకనే కేటీఆర్, హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదవాడికి ఇళ్లు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అర్హులైన పేదలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సైదిరెడ్డి, బోడ యాదయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు కొత్త దశరథ, గద్దల శేఖర్, రామాంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొండ భాస్కర్, కొండేటి శంకర్, హౌసింగ్ ఏఈ జ్యోతి, గ్రామ కార్యదర్శులు హరికృష్ణ, నాగరమణి, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు యాదయ్య, కొండేటి శంకర్, రేణుక, వీరబోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్మాపురంలో ఇంటి నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

మంచితనంతో మరింత గుర్తింపు

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మంచితనమే మరింత గుర్తింపు తెస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిటీ జిల్లా మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ ఉబ్బపల్లి సోములు కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా స్థానికులకు సుదీర్ఘకాలం సేవలందించిన సోములు పట్టణ ప్రజల మనసులో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సోములు పారిశుధ్య కార్మికుల వేతన సవరణ చేయించారని గుర్తు చేశారు. పట్టణాభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్లు తిరునగరు భార్గవ్, మెరుగు రోశయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి సోములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రాంబో శ్రీను, ఎంసీపీఐ రాష్ట్రకమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య, నాయకులు ఉబ్బపల్లి మధు, చిలుకూరి శ్యాం, అన్నభీమోజు నాగార్జునాచారి, ఇలియాస్‌ఖాన్, నరసింహ, రామస్వామి, మాజిద్, ఫయాజ్, లింగరాజు, సోమసుందర్, రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, చిత్రంలో భార్గవ్

పాత వారుండరు.. కొత్తవారికి ఇవ్వరు

(5వ పేజీ తరువాయి)

ఒప్పందం కుదుర్చుకోగా, మరి కొందరు 25 ఏళ్ల వరకు అగ్రిమెంట్ చేసుకున్నామని చెబుతుండగా, ఏ దుకాణానికి ఎన్ని సంవత్సరాలకు అగ్రిమెంట్ ఉందో తెలిపే పత్రాలను భద్రపర్చడంలో మునిసిపల్ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణల వెల్లువెత్తుతున్నాయి. గడువు తీరిన మడిగలను, సబ్ లీజులకు ఇచ్చిన వాటిని ఖాళీ చేయించి కొత్తగా టెండరుయల పిలవకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.


నోటీసులతోనే సరి

మునిసిపల్ కాంప్లెక్స్ దుకాణాలు సబ్‌లీజులకు ఇచ్చారని, అగ్రిమెంట్‌ను రద్దు చేసి తిరిగి టెండర్లు పిలవాలని కొందరు 2012లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో నాటి మునిసిపల్ కమిషనర్ విచారణ నిర్వహించి 22 మడిగెల్లో మాత్రమే లీజుదారులు ఉన్నారని, 66 మడిగెలు సబ్‌లీజుకు ఇచ్చినట్టు గుర్తించి వారిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఇప్పటి వరకు ఖాళీ చేయకపోగా, లీజు గడువు తీరిన వారిని సైతం ఖాళీ చేయడం లేదు. నూతన టెండర్లు పిలవకుండా కొందరు రాజకీయ నేతలు, వ్యాపార ప్రముఖులతో ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దుకాణాలు పొందినవారు సబ్ లీజు సమయంలో అడ్వాన్స్ పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసినట్టు సమాచా రం. సుమారు 20 దుణాలను ఇలా వసూలు చేసి అద్దెకు ఇచ్చినేట్టు తెలిసింది.

కౌన్సిల్ తీర్మానం చేసినా...

నూతన టెండర్లకు అధికారులు మూడుమార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఈ ప్రక్రియ ముందు పడకుండా రాజకీయ పలుకుబడితో నిలిపివేయించారనే ఆరోపణలు ఉన్నాయి. 2018లో మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చించి సబ్‌లీజుగా ఉన్న 66 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. దీంతో పలువురు రూ.25వేల చొప్పున డీడీలు చెల్లించి 37 దుకాణాలను రూ.1,44,87,000కు దక్కించుకున్నారు. అయితే పాతవారు హైకోర్టును ఆశ్రయించడంతో టెండరు ప్రక్రియ నిలిచింది. నిబంధనలకు లోబడి 88మడిగెలకు 33శాతం అద్దె పెంచి నేటికీ అదే వసూలు చేస్తున్నారు. మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పార్టీకి ఒకరు చొప్పున ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి మడిగెల రీటెండర్ వ్యవహారంపై చర్యలు చేపట్టాలని సూచించినా అది కార్యరూపం దాల్చలేదు. 2024లో హైకోర్టు తీర్పు వెలువరించినా, నేటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతేకాక దుకాణదారులు సుమారు రూ.60లక్ష వరకు అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. 2015లో మొదటి అంతస్తులో 90మడిగెలు నిర్మించగా, వాటికి టెండర్లు పిలవకపోవడంతో అవి వృథా ఉన్నాయి.

పదేళ్లకోసారి టెండర్లు పిలవాలి



మునిసిపల్ కాంప్లెక్స్ కొందరి ఆధీనంలో ఉంచుకోవడం నిబంధనలకు విరుద్ధం. రాజకీయ ప్రయోజనాలకంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యం. ప్రభుత్వ దుకాణ సముదాయలకు ప్రతీ పదేళ్లకోసారి టెండర్లు పిలవాలి. 10శాతం పెంపుతో అద్దెలకు ఇవ్వాలి. దీంతో మునిసిపాలిటీకి ఆదాయం వస్తుంది.

- వేనేపల్లి పాండురంగారావు, మట్టిమనుషుల వేదిక కన్వీనర్

పై అధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఇటీవలే నూతన కమిషనర్‌గా చార్జ్ తీసుకున్న. షాపింగ్ కాంప్లెక్స్ సమస్యను అధికారులు నా దృష్టికి తెచ్చారు. మునిసిపల్ ఆదాయానికి గండిపడుతుంటే చూస్తూ ఊరుకోం. సమగ్ర నివేదిక రూపొందించి పైఅధికారులకు నివేదిస్తా. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

- జి.శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ